నమస్తే తెలంగాణ

జనగామ

3 | శనివారం 13 జనవరి 2024 | JANAGAON


## 20న జాకారంలో మెగా జాబ్‌మేళా




ఏటూరునాగారం, జనవరి 12 : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 20న ములుగు మండలం జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో అంకిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాలో 20 బహుళ జాతి కంపెనీలకు చెందిన వారు పాల్గొంటారని పీవో వెల్లడించారు. ప్రతి నెలా రూ. 15నుంచి 30వేల వేతనం పొందే అవకాశం ఉందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీటెక్ చదివిన వారికి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న వారు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ బయోడేటా, విద్యార్హత జిరాక్స్ ప్రతులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 8008932159,7981633716 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పీవో తెలిపారు.



మేడారం పంచాయతీ పరిధిలో ఉన్న శానిటేషన్ భవనం వద్ద సీసీ పనులు

# వీడీసీలను వదిలేశారు!

## గ్రామాభివృద్ధి కమిటీల అనుమతులు లేకుండానే మేడారం జాతర పనులు

- కాంట్రాక్టర్లతో అధికారుల కుమ్మక్కు!
- గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి
- నకిలీ బాండ్ పేపర్లతో బిల్లులు లేపే ప్రయత్నాలు!
- వీడీసీలు లేకుండా పనులెలా చేస్తారని సర్పంచ్‌ల గుర్రు

*ములుగు, జనవరి12(నమస్తేతెలంగాణ) : మేడారం జాతర పరిధిలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీల అనుమతి లేకుండానే అభివృద్ధి పనులు చేపట్టడం స్థానిక గ్రామ పాలకులు, వీడీసీ సభ్యుల్లో ఆగ్రహానికి కారణమవుతున్నది. జాతర అభివృద్ధిలో నామినేటెడ్ పనులకు వీడీసీల అనుమతి తప్పనిసరి. గతంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, వీడీసీల అనుమతి తీసుకున్నాకే పనులు చేపట్టేవారు. అగ్రిమెంట్ అనంతరమే పనులను ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తూతూమంత్రంగా పనులు కానిచ్చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాభివృద్ధికి రావాల్సిన నిధులను కాంట్రాక్టర్లకే కట్టబెట్టేలా అధికారులు వ్యవహరిస్తున్నారని, పంచాయతీల అనుమతి, వీడీసీల ప్రమేయం లేకుండానే పనులు చేసేందుకు సిద్ధమయ్యారని, వీడీసీ అనుమతి లేనిదే బిల్లులు ఇవ్వొద్దు అన్న నిబంధన ఉన్నా అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.*

### వీడీసీల అనుమతి తప్పనిసరి



పంచాయతీ పరిధిలో చేపట్టే నామినేటెడ్ పనులకు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ అనుమతి తప్పనిసరి. ఈ పనులను మమ్మల్ని సంప్రదించకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు ప్రారంభించారు. అధికారులు కూడా ఎలాంటి అగ్రిమెంట్ చేసుకోకుండా పనులు ప్రారంభించడంపై అనుమానాలున్నాయి. మమ్మల్ని ఆహ్వానించకుండా, వీడీసీ అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా పనులు ప్రారంభిస్తున్నారు. దీనిద్వారా పంచాయతీకి రావాల్సిన నిధులు రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

**- చిడం బాబురావు, మేడారం సర్పంచ్**

మేడారం జాతర అభివృద్ధి పనుల్లో భాగంగా ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు మేడారం పంచాయతీ పరిధిలో రోడ్లు, రోడ్ల మరమ్మతులకు రూ.80లక్షలు, ఊరట్టం పంచాయతీ పరిధిలో రూ. 31లక్షల విలువగల నామినేటెడ్ పనులను కేటాయించారు. పనుల్లో రూ.లక్షకు 5శాతం కమీషన్ చెల్లించాల్సి ఉంటుంది. కమీషన్ రూపంలో పంచాయతీలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరి గ్రామాల్లో అభివృద్ధి పనులకు వీలు కలుగుతుంది. కానీ అధికారులు, కాంట్రాక్టర్ల తీరుతో గ్రామాలకు రావాల్సిన నిధులకు గండిపడేలా ఉంది. అధికారులు కూడా వీడీసీలకు సంబంధం లేకుండానే పనులను ప్రారంభిస్తూ కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆయా జీపీల సర్పంచ్‌లు వీడీసీల అనుమతి తీసుకోరా అని కాంట్రాక్టర్లను అడిగినా తీసుకుంటామని అప్పటి మందం సమాధానం చెబుతూ పనులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. 10 రోజుల క్రితం ప్రారంభించిన పనులను కూడా ఆ రోజున అగ్రిమెంట్ చేసుకున్నట్లుగా బాండ్ పేపర్‌ను అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు బాండ్ పేపర్‌పై వీడీసీలు ఎలాంటి సంతకాలు చేయలేదు. పనులను ప్రారంభిస్తున్నట్లు సంబంధిత పంచాయతీలకు సమాచారం కూడా లేదు. నకిలీ బాండ్ పేపర్లను సృష్టించి కాంట్రాక్టర్లు, అధికారులు బిల్లులు ఎత్తుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.





వీడియో సందేశాన్ని విడుదల చేస్తున్న మంత్రి సురేఖ

## ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

**మంత్రి కొండా సురేఖ**

వరంగల్, జనవరి 12 (నమస్తేతెలంగాణ): భావితరాలకు నివాసయోగ్యమైన పరిసరాలను అందించడం మనందరి బాధ్యతని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. పచ్చదనం పెంపునకు ఎంతగా ప్రాధాన్యం ఇస్తున్నామో నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని కూడా వీలైనంతగా తగ్గించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, అవగాహన లేకుండా విపరీతంగా వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మన పరిసరాలు, గాలి, నీరు కలుషితం అవుతున్నదని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రయత్నాలకు తోడు ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గింపును విధిగా చేపట్టాలని సురేఖ పిలుపునిచ్చారు. తన సెక్రటేరియేట్ కార్యాలయంతోపాటు నివాసంలోనూ వీలైనంతగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు నిర్ణయించామని తెలిపారు. ప్లాస్టిక్ బాటిల్స్‌కు బదులు గ్లాస్ బాటిళ్లు, లేదంటే స్టీల్ వస్తువుల వాడకాన్ని పెంచాలని మంత్రి సురేఖ సూచించారు.



శాయంపేట : చలివాగు నుంచి టెక్స్‌టైల్ పార్కుకు పైపులైన్ పనులు

## మరో రెండు నెలల్లో..

**టెక్స్‌టైల్ పార్కుకు గోదావరి జలాలు**

శాయంపేట, జనవరి 12 : శాయంపేట మండలం జోగంపల్లి శివారు చలివాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు గోదావరి జలాల తరలింపు రెండు నెలల్లో మొదలు కానున్నట్లు అధికారులు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కుకు చలివాగు నుంచి నీరందించేందుకు రూ.100 కోట్లతో పనులు చేపట్టారు. టెక్స్‌టైల్ పార్కులో సంప్ పూర్తికాగా ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు కొనసాగుతున్నాయి. కాంట్రాక్ట్ గడువు ఈ నెల వరకే ఉండగా మరో ఆరు నెలలు పొడిగించారు. పార్కుకు ఏటా 0.163 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు. ప్రాజెక్టు నుంచి మైలారం ద్వారా గూడెప్పాడ్, ఆగ్రంపాడ్, అక్కంపేట, మీదుగా కాకతీయ కెనాల్ నుంచి గీసుకొండ ద్వారా టెక్స్‌టైల్ పార్కుకు 40 కిలోమీటర్ల పైపులైన్ వేశారు. మధ్యలో రెండు చోట్ల 30మీటర్ల చొప్పున రోడ్డు పనులు చేపట్టాల్సి ఉన్నది. పార్కులో రెండు ఇంటర్నల్ రోడ్లు పూర్తి చేయాల్సి ఉంది. సంగెం మండలం రాయినికుంట (చింతలపల్లి) పరిధిలో పార్కు కోసం 1200 ఎంఎల్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మిస్తున్నారు. చలివాగులో ఇంటేక్‌వెల్ నిర్మాణం పూర్తికాగా గేట్లు బిగించనున్నారు. 240 హెచ్‌పీ స్థాయి మూడు మోటర్లు బిగించి రెండింటిని వినియోగిస్తారు.



ఆలయ ముఖ ద్వారం

## మల్లన్న జాతరకు వేళాయె..

**కొలిచిన వారికి కొంగు బంగారం**

**నేడు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు షురూ..**

**ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**

ఐనవోలు, జనవరి 12: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ ఆవరణను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

### ఐనవోలు ఆలయ విశిష్టత..

చాళుక్యుల సామంత రాజులుగా ఉన్న కాకతీయులు కాలక్రమంలో స్వతంత్ర రాజులుగా ఓరుగల్లు గడ్డను ఏలిన విషయం తెలిసిందే. రాష్ట్రకూట రాజు కృష్ణ-2 పాలన కాలం క్రీస్తు శకం 850 నుంచి 914 వరకు కొనసాంది. దాదాపు 1100 ఏళ్ల ముందు నుంచే ఐనవోలు ఉందని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తున్నది. కాలక్రమేణా ఈ ప్రాంతాన్ని వెలమ రాజులు పాలించినట్లు శిలాశాసనం చెబుతున్నది. ఇదే సామాజిక వర్గానికి చెందిన మార్నేని వంశస్తులు ఆలయ నిర్వహణ బాధ్యతను కొనసాగించారు. కాలక్రమంలో మార్నేని వంశస్తులు 1966లో దేవాదాయ శాఖకు అప్పగించారు.

### గొల్లకురుమల ఇలవేల్పు

సుమారు పది అడుగుల ఎత్తుతో విశాల నేత్రాలు, కోరమీసాలతో చతుర్భుజాలలో ఖడ్గం, త్రిశూలం, ఢమరుకం, పణపాత్రలతో



ఐనవోలు మల్లికార్జునస్వామి

స్వామివారు కనిపిస్తారు. ఇరువైపులా గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మ కొలువుదీరి ఉంటారు. కుడి పాదం కింద మల్లన్న చేతిలో చనిపోయిన మాణిమల్లసూరుల శిరస్సులు కనిపిస్తాయి. ఈయన ఇద్దరి భార్యల్లో బలిజ మేడలమ్మ కర్ణాకట ప్రాంత వాసి. రెండో భార్య గొల్లకేతమ్మ మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన అమ్మవారిగా చెబుతుంటారు. గొల్లకేతమ్మను మల్లన్న పెళ్లి చేసుకున్నాడు కాబట్టి మల్లికార్జునస్వామిని వారి ఇలవేల్పుగా గొల్లకురుమలు పసుపు బండారితో పూజిస్తారు.

### బ్రహ్మోత్సవాలు ఇలా..

నేడు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 14న భోగి పండుగ, 15న మకర సంక్రాంతి బండ్లు తిరుగుట, 16న కనుమ, 17న మహాసంప్రోక్ష సమారాధన, ఫిబ్రవరి 14న భ్రమరాంబిక అమ్మవారి దశమ వార్షికోత్సవం, ఫిబ్రవరి 24న ఎల్లమ్మ దేవత పండుగతో ఉత్సవాలు ముగుస్తాయి.




## కేయూలో అక్రమాలపై యూజీసీ ఆరా

**రిపోర్టు పంపాలని వీసీ, రిజిస్ట్రార్‌కు ఈ-మెయిల్**

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12 : కేయూలో రెండున్నరేళ్లుగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆరా తీసింది. వర్సిటీ ఉన్నతాధికారులు అధ్యాపకులపై వ్యక్తిగత కక్షలకు పాల్పడుతున్న తీరుపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో పాటు యూజీసీకి అకుట్ సభ్యులు ఫిర్యాదు చేశారు. యూజీసీ వెంటనే స్పందించి వర్సిటీలో జరుగుతున్న అవినీతిపై వెంటనే గ్రౌండ్ రిపోర్టు పంపాలని వీసీ, రిజిస్ట్రార్‌కు గురువారం ఈ-మెయిల్ రూపంలో కోరినట్లు తెలిసింది.

## హామీల అమలులో కాంగ్రెస్ నిర్లక్ష్యం

**నెల రోజులైనా నెరవేరని రూ.2 లక్షల రైతు రుణమాఫీ**

**'ప్రజాపాలన' పేరుతో కాలయాపన**

**స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్/వేలేరు, జనవరి 12 : అధికారమే లక్ష్యంగా ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతోటు 420 హామీలు ఇచ్చి అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా వేలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీ-పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గత డిసెంబర్ 9న రూ.2 లక్షల వరకున్న రైతుల పంట రుణాలు మాఫీ చేస్తానని తెలిపి నెల రోజులు గడిచినా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నందున రైతులందరికీ రైతుబంధు, రుణమాఫీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సచివాలయంలో లంకె బిందెలున్నాయని వస్తే ఖాళీ బిందెలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉండవని పేపర్లు, కంప్యూటర్లు ఉంటాయనే విషయం గమనించాలని హితవు పలికారు. రాష్ట్ర అప్పులపై శ్వేతపత్రాలు, అభివృద్ధి పనులపై జ్యుడీషియల్ విచారణ, 'ప్రజాపాలన'లో దరఖాస్తుల స్వీకరణ పేరుతో కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తున్నదని కడియం ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ పనులు మొదలుకాకముందే రైతుబంధు డబ్బులు వారి అకౌంట్లలో జమయ్యేవని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, వైస్ ఎంపీపీ సంపత్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాయిత మాధవ రెడ్డి, నాయకులు బిల్లా యాదగిరి, మల్లికార్జున్, భూపతి రాజు పాల్గొన్నారు.

**కడియం ఫౌండేషన్ సహకారం**

క్రీడలకు కడియం ఫౌండేషన్ తన వంతు సహకారం అందిస్తున్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్లులో శుక్రవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ పోగుల సారంగపాణి అధ్యక్షతన నిర్వహించిన సభలో కడియం మాట్లాడుతూ ఏటా నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కడియం ఫౌండేషన్ సహకారం అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బెలిదె వెంకన్న, రాపోలు మధుసూదన్‌రెడ్డి, బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, జఫర్‌గఢ్ పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు, యూత్ సభ్యులు అన్నెపు కుమార్, సర్పంచ్‌లు కోతి రా ములు, ఆనంధం, చాగల్లు ఉపసర్పంచ్ రజితా రాజేశ్, కనకం రమేశ్, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ హిమబిందు, ఎంపీటీసీ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ ఫాతి కుమార్, జీడి రమేశ్, అంబటి కిషన్ రాజు, పొన్న రాజేశ్, సంపత్ రాజు పాల్గొన్నారు.




ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ చంద్రశేఖర్

## దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ సేవలు

**ఎంజీఎంలో ప్రారంభించిన సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్**

వరంగల్‌చౌరస్తా, జనవరి 12: ఎంజీఎం దవాఖానలో దివ్యాంగులకు ప్రత్యేక సేవలు అందించేందుకు ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటికే వృద్ధులకు ఓపీ సేవలు అందిస్తున్న 6వ నంబర్ గదిలోనే దివ్యాంగులకు సైతం ఓపీ సేవలను ప్రారంభించారు. మొదటి రోజు 47 మందికి ఓపీ సేవలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ మురళి, డాక్టర్ ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

## విద్యార్థిని ఆత్మహత్య



దీప్తి(ఫైల్)

హసన్‌పర్తి, జనవరి 12: విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఓ యూనివర్సిటీలో జరిగింది. సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా మావాలకాలనీకి చెందిన రాథోడ్ దీప్తి(19) బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. కళాశాల హాస్టల్ రూమ్‌లో ముగ్గురు బీటెక్ విద్యార్థులతో కలిసి ఉంటున్నది. బీటెక్ విద్యార్థులకు సెలవు ఇవ్వడంతో ఆ ముగ్గురు హాస్టల్‌కు రాలేదు. రూమ్‌లో దీప్తి ఒక్కతే ఉంది. శుక్రవారం తెల్లవారుజామున విద్యార్థిని చున్నీతో హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీప్తి ఫస్ట్ ఇయర్‌లో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతోపాటు ప్రేమ విఫలంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు

## ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 4 రోజులు సెలవు



కాశీబుగ్గ, జనవరి 12: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి క్యారం సంగయ్య తెలిపారు. 13న వారాంతపు యార్డు బంద్, 14న భోగి, 15న సంక్రాతి, 16న కనుమ సందర్భంగా నాలుగు రోజులు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు. 17న నుంచి మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు. మార్కెట్‌కు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు.